# వందనాలు .. వందనాలు... తెలంగాణా విద్యార్థులకు

**పి. నిరూప్, సుప్రీంకోర్ట్ న్యాయవాది,**

**అనుసృజన : మారుపాక రాకేశ్, తెలంగాణ భాష హస్తకళల పరిశోధకులు**

1969 సం॥లో ఉవ్వెత్తున ఎగసిన తెలంగాణా ప్రత్యేక రాష్ట్ర ఉద్యమపు సంఘటనలకు సరిపోయేవిధంగానే, ఇప్పుడు కూడా - రాష్ట్రం కోసం జరిగిన, జరుగుతున్న ఉద్యమం మరియు రాష్ట్ర సాధన ప్రక్రియ కూడా అనూహ్యంగా విద్యార్థుల జాయింట్ ఆక్షన్ కమిటీ చేతుల్లోకి, ఉద్యోగ సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీల్లోకి వెళ్ళింది.

ఆ విధంగా విద్యార్థుల సమిష్టి నాయకత్వపు చేతుల్లోకి వెళ్ళడమే సమయోచితంగా ఉంటుందనీ, మరొక్కసారి రాజకీయ కుట్రలకు బలయ్యే అస్కారమే లేదనీ ప్రజలందరూ భావిస్తుండడం సబబైనదే!

ఇప్పుడు జరుగుతున్న పార్లమెంటు శీతాకాలపు సమావేశాల్లోనే తెలంగాణా బిల్లును ప్రవేశ పెట్టాలంటూ, కె.సి.ఆర్. ఆమరణ నిరాహార దీక్ష ప్రకటించినప్పుడు మద్దతుగా నిలవడంలోనూ, ఉద్యమం నీరుగార్చటానికి చెలరేగిన పోలీసు హింసలో, బయట ఆత్మహత్యల మార్గంలో ఎందరో ప్రాణాలు కోల్పోతూ, ఉద్యమం తన చేయిచారి పోతుందన్న నెపంతో కె.సి.ఆర్. తనదీక్షను విరమించాలనుకున్నప్పుడు నైతిక బాధ్యతను గుర్తుచేస్తూ తిరగబడటంలోనూ - విద్యార్థి నాయకులు కనబరిచిన స్ఫూర్తి, సమయస్ఫూర్తి కొనియాడదగినవి. ఈనాడు ప్రజల మనసులో నెలకొన్న అనుమానం ఏమిటంటే, ఇంతదాక విజయాన్ని సాధించిన ఈ విద్యార్థి లోకం, చివరివరకూ సమిష్టిగా నిలిచి, తమకు గల ఎన్నో పరిమితుల్లో సైతం, పూర్తి లక్ష్యాన్ని సాధించగలదా ? లేక 1969 జరిగిన విధంగా, అగ్నిపర్వతం బద్దలయినట్టు ఉధృతమై.., ఏడాదికి పైగా ఉద్యమంకొనసాగి, చివరికి హింసాత్మకంగా మారిన క్రమంలో, 400 ప్రాణాల బలిదానాన్ని సైతం మంటగలిపిన ఆనాటి రాజకీయనాయకులను "తలదన్నే" లెవెల్లో దిగే నాయకులకు పగ్గాలను అప్పజెప్పుతుందా అన్నదే ప్రధానంగా మారింది.

గత కాలపు విద్యార్థి ఉద్యమాల చరిత్రని ఒకసారి పరిశీలిస్తే, 60ల కాలంలో ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో దేశాల్లో విద్యార్థులు ఉద్యమాల బాట పట్టారు. ఫ్రాన్స్, బ్రిటన్, ఉత్తర ఐర్లాండ్ మరియు ఇటలీ దేశాల్లో ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై ఎన్నో రకాల నిరసనలు, ప్రదర్శనలు వెల్లువెత్తేవి. అమెరికాలో సైతం వియత్నాంపై జరిగిన యుద్ధపు ప్రభావాలు తీవ్రంగా ఉండేవి. కానీ వీటన్నికంటే ప్రముఖంగా చెప్పుకోవాల్సిదొకటున్నది. అదే మెక్సికో యూనివర్సిటీ విద్యార్థుల నిరసన ప్రదర్శనపై (TLATELOCO SQUARE) వద్ద జరిగిన ఊచకోత... దిగ్భ్రాంతి కలిగించే ఆ మారణకాండలో 300 పైగా విద్యార్థులు మరణించడం చరిత్రలో మరవలేనిదిగా నిలిచిపోయింది.

ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న విద్యార్థి ఉద్యమాలూ వాటిపై పోలీసు, మిలటరీ బలగాల విజృంభణలతో అట్టుడుకుతున్న కాలమది. ఆనాటి విప్లవాల పుటల్లో, ఒక ప్రత్యేకతను సంతరించుకుంటూ ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు సైతం, ప్రత్యక్ష ఉద్యమాలలో పాల్గొని తమ త్యాగాలతో తరించారు. ఎందరో నవ యువకులు విప్లవాగ్నికి సమిధలైనారు. తర తరాలుగా

*Contd..2...*

సాగుతున్న పరాయి పాలన వల్ల సంభవించే ప్రాంతీయ వనరుల దోపిడీనీ, వలసలదాడినీ ఎదురొడ్డి ప్రపంచానికి తెలంగాణా అస్థిత్వాన్నీ, పోరాటాలనూ తెలియపరిచారు.

అయితే 1969 నాటి పోరాటమైనా, ఈనాటి తెలంగాణా రాష్ట్ర సాధన ఉద్యమమైనా, ప్రాణత్యాగాల వీరోచిత విద్యార్థులు కేవలం ఉస్మానియా క్యాంపస్‌కే పరిమితం కాక (తెలంగాణా) పది జిల్లాల నుండీ ఒకే రకమైన ప్రతిస్పందన కనబడటం గమనార్హం.

దశాబ్దాలుగా 610 జి.ఓ. అమలూ, తద్వారా లభించే ఫలితాలకోసం పోరాడుతూ వస్తున్న ఉద్యోగస్థులూ, హైదరాబాద్ పోలీసు శాఖ ఫ్రీ -జోన్ కానే కాదని పోరాటాలకు సిద్ధమైన పోలీసులకూ భిన్నంగా నిరాయుధులైన ఇక్కడి విద్యార్థులు పోరాడుతున్నది ఏ ఒక్క విధానపరమైన సమస్యపైనా కాదు !! తెలంగాణా సాధనలో విఫలవవుతున్న నాయకత్వంపై అసంతృప్తి వ్యక్తీకరిస్తునే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తెలంగాణా ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షను గుర్తింపచేసి దశాబ్దాలుగా పెండింగ్‌లో పెట్టబడుతున్న తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు సత్వరంగా జరగాలని డిమాండ్ చేస్తున్నారు.

అసలు "ఆంధ్రప్రదేశ్" అవతరణ అన్నదే - ఎన్నో అనుమానాల, భవిష్యత్ పరిణామాలెలా ఉంటాయోనన్న ఆందోళనల మధ్య జరిగిందన్నది చారిత్రక వాస్తవం. 1955లోనే జస్టిస్ ఫజల్ అలీ నేతృత్వంలో "రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ"ను చేపట్టిన త్రిసభ్య కమిటి వెలిబుచ్చిన అనుమానాలను నిజం చేస్తూ ఆంధ్రతో హైదరాబాదు రాష్ట్రపు (మహారాష్ట్ర కర్ణాటకలో కలిపిన జిల్లాలను మినహాయించి) కలయిక నిజంగానే అంతర్గత వలసలకు దారితీసి పరిస్థితులు ఎంతదాకా వచ్చాయంటే అది ఇది అని లేకుండా అన్ని వర్గాల్లో ఆదిపత్యం పూర్తిగా వలసపాలకుల, పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్ళింది.

అయితే ఇప్పుడు అందరి దృష్టి కేంద్రీకృతమవుతున్నది విద్యార్థులవైపే... వారు చేపట్టిన ఉద్యమాన్ని కొనసాగిస్తూ.. చిట్టచివరి అంకం పూర్తయ్యేదాక ఇదే స్ఫూర్తిని విద్యార్థులు ప్రదర్శించాలి. ఎందుకంటే అపారమైన ధనబలం గల వలస పాలకుల నుండి తీవ్రమైన వ్యతిరేకతా వారు ఢిల్లీలో ప్రదర్శించే కుటిల నీతీ (మీ త్యాగాల ముందు సాటిరానిదైనా), కొన్ని అడ్డంకులు మాత్రం తప్పక సృష్టిస్తుంది.

ఇక్కడ ఒక విషయం రూఢిగా చెప్పవచ్చు. నిస్వార్థంగా తమ జాతికై పోరాడే విద్యార్థి శక్తిలో మాత్రమే ఇంతటి అపారమైన నిబద్ధత ఉంటుంది. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న రాష్ట్ర ఏర్పాటు, స్వయం పాలనా కోరుకుంటున్న ఉద్యమంలో స్వార్థ ప్రయోజనాల కోసం చొరబడే వ్యక్తులు, శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఈ ఉద్యమాలను దశాబ్దాలుగా గమనిస్తూన్నవాళ్ళకు ఇప్పుడు ఆ పరిస్థితి రాదనీ, విద్యార్థులు ఈసారి సరిదిద్దుకోలేనంతటి పొరపాట్లను చేయరనీ, ప్రలోభాలకు లొంగరనీ తెలంగాణ యావత్తు విశ్వసిస్తున్నది. అంత ఖచ్చితంగా చెప్పటానికి కారణాలైన యోగ్యతలు ఇక్కడి విద్యార్థి నాయకత్వానికి ఎక్కణ్ణించి వచ్చాయి? ఇక్కడి విద్యార్థి ఉద్యమం మిగతా ప్రాంతపు ఉద్యమాలకంటే భిన్నమైందెలా ?

*Contd..3...*

కారణాలను పరిశీలిస్తే... మొదటిది - ఇక్కడి విద్యార్థులు స్వార్థపరులైన రాజకీయ నాయకుల తీరుతో, కుట్రలతో విసిగి వేసారి తీవ్రంగా రగిలిపోతున్నారు, నాయకుల బాధ్యతను తమపై వేసుకోవడానికి సిద్దపడ్డారు. రెండవది - రాష్ట్ర రాజకీయాల్లో నిరంతరంగా చిచ్చు రగులుస్తున్న కులాల, మతాల, వర్గాల, పార్టీల, జెండాల, ఎజెండాలకు అతీతంగా తెలంగాణా విద్యార్థి లోకమంతా తమ రాష్ట్ర సాధనకై ఒక్కటై నిలవడం. మూడవది- స్వరాష్ట్ర కాంక్ష బలీయంగా హృదయాలను కదిలించడానికి కారణాలనైన వనరుల దోపిడి (నీళ్ళు, ఖనిజాలు ఇలాంటివెన్నో...) ఆవాసాలు, కాలనీలతో నగరాన్ని ఆక్రమించి హైదరాబాదు నగరంలో జీవనాన్ని నరక ప్రాయం చేసేంత స్థాయికి దిగజార్చడానికి కారణాలైన వలసలూ, భాషపై హేళన, సంస్కృతిపై దాడి, ఇంకెన్నో రకాల అవమానాలు, వాళ్ళు ప్రత్యక్షంగా అనుభవించడమే కాక, అధునిక ప్రసార మాధ్యమాల ద్వారా వాస్తవ చరిత్రను అధ్యయనం చేసి పూర్తిగా తెలుసుకోవడం జరిగింది.

ఇవ్వన్నీ ఒక ఎత్తైతే - అత్యంత ప్రధాన కారణం ఏమిటంటే, దశాబ్దాలుగా వందలాది విద్యార్థులు రక్తం చిందించి అమరులైన జ్ఞాపకాలు వారి మదిలో ఎల్లప్పుడు తాజాగా ఉంటూ వారికి దిశానిర్దేశంగాను, కర్తవ్య దీక్షలో నిమగ్నమై ఉండేటట్టుగానూ చేస్తూండడం.

నిజమే ! తెలంగాణకై దశాబ్దాలుగా పోరాడుతూ అసువులు బాసిన అమరవీరుల్లో విద్యార్థులే అధికం. తెలంగాణా ప్రజలకు స్వాతంత్ర్య పోరాటం బ్రిటిష్ వారితో జరగలేదు సరికదా, అసలు స్వాతంత్ర్యమే దేశ పౌరులందరితో సమానంగా రాలేదు. ఆ కాలం నుండే విద్యార్థులు (ఆనాటి అవసరాన్ని బట్టి సాయుధ) పోరాటాలు చేయడం మళ్ళీ 1952లో, తిరిగి 1969 లో 400లకు పైగా బలిదానాలు... మళ్ళీ ఈ నాడు 10 రోజుల వ్యవధిలోనే 37 మంది ప్రాణాలు కోల్పోతే వారిలో 22 మంది విద్యార్థులే... (ఆత్మార్పణలు కొన్నైతే అమానుషంగా ఒకొక్క విద్యార్థిపై 8 మందికి పైగా పోలీసులు ఎగబడి కొట్టిన లాఠీ దెబ్బలకు తీవ్రంగా గాయాలై కొందరు)

ఇందుకే ఈ ప్రాంతపు విద్యార్థుల్లో త్యాగమూ, చైతన్యమూ, పోరాట స్ఫూర్తి అన్నీ అవసరమైన పాళ్ళలో మేళవించి ఉంటాయి. అంతటి చైతన్యవంతులు కాబట్టే, పాలకులు, ప్రభుత్వాలు, యూనివర్సిటీ క్యాంపస్‌లను ఆనుకునే పోలీసులను మోహరించడం, వారిని అదుపు చేయడానికి 'ప్రత్యేక' బలగాలను, వ్యక్తులను, పద్ధతులను ప్రయోగించడం మనం చూస్తున్నాము. కానీ, విద్యార్థుల మనస్తత్వాలను, వ్యవహారశైలిని అర్థం చేసుకోగలిగిన, అర్థంచేసుకునే విధంగా శిక్షణ పొందిన బలగాలకు బదులు "సాయుధులైన శత్రువు"లను ఎదుర్కొనడానికి ఉపయోగించే బలగాలను దించడం, అమూల్యమైన భవిష్యత్తు గల యువతరాన్ని కర్కశ, కరాళ పద్ధతుల్లో నిలిపివేయడం కాదా ?

విద్యార్థులెవరైనా విధ్వంసానికి పాల్పడ్డా అది వ్యక్తిగత ప్రతీకారం కోసమో, లూటీ ద్వారా ఆస్తుల ఆక్రమణ కోసమో చేయలేదే, వారు నినాదాలు చేసారు గానీ వ్యక్తులపై దాడులకు దిగలేదే! చెదురు మదురుగా జరిగిన ఇలాంటి కొన్ని సంఘటనలు విద్యార్థుల అన్యాయపు అరెస్టులకు నిరసనగానూ, కె.సి.ఆర్. ప్రాణాపాయస్థితిలో ఉన్నట్టు మీడియాలో వచ్చిన వార్తల నేపథ్యంలోనూ జరిగినట్టు గమనించాలి.

*Contd..4...*

ఐనా, చివరివరకు ప్రభుత్వం చలించకుండా నిమ్మకు నీరెత్తినట్టు కూర్చొని చోద్యం చూడడం విద్యార్థుల సహనానికి, ఆవేశానికి హద్దులను పరిక్షించినట్లుగానే సాగింది.

ఉద్యమం హింసాత్మకంగా మారకూడదనీ, 1969లో లాగా హింసద్వారా అణచడానికి ప్రక్కదోవ పట్టించే సంఘ వ్యతిరేక శక్తులు చొరబడగలరని పదే పదే గుర్తించుకుంటూ విద్యార్థులు సంయమనం పాటించడం అందరూ చూసారు. అందుకే 10 రోజుల దీక్షా సమయంలో ప్రాణాలు కోల్పోయారు కాని హత్యలూ, ఆస్థి నష్టాలూ జరుగలేదు.

1990లో వెల్లువెత్తిన అస్సాం విద్యార్థి ఉద్యమంలోనూ (ASU), 1980లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా గుజరాత్‌లోనూ, అంతెందుకు విభజనకు పూర్వం ఉత్తరాఖడ్, ఝార్ఖండ్‌లలో రాష్ట్రాలా కోసం విద్యార్థులు జరిపిన పోరాటాలను మరచిపోగలమా ? అయితే, ఆమరణ దీక్షతో ఇక్కడి ప్రజలందరి సంఘటితం చేసింది కె.సి.ఆర్. అయితే తెలంగాణా రాష్ట్ర పోరాటాన్ని దిగ్విజయంగా చివరి అంకం వరకు తీసుకురాగలిగిన ఘనత మాత్రం ఖచ్చితంగా విద్యార్థులదే.

**తెలంగాణా ప్రజల దృష్టిలో ఈ విద్యార్థులు మహోన్నత ఉత్కృష్టమైన, విప్లవ జ్యోతులై దేదీప్యమాన జ్యోతులై ప్రకాశిస్తూనే ఉంటారు.**

తరువాతి కర్తవ్యంగా పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి, ఆమోదింపచేసి, రాష్ట్రావతరణ జరిగేంత వరకు వీరు అత్యంత జాగరూకులై ఉండాలి. ముందు చెప్పిన విధంగా ఏ మాత్రం అజాగ్రత్త వహించినా, విద్యార్థులో భిన్నాభిప్రాయాలు కలిగించి లక్ష్యాన్ని తప్పుదోవ పట్టించడానికి సంకుచిత, స్వార్థ శక్తులన్ని సాధ్యమైనన్ని ప్రయత్నాలు చేస్తాయి.

ఈ సందర్భంగా, తెలంగాణా విద్యార్థిలోకాన్ని ఎన్ని విధాలుగా హృదయపూర్వకంగా అభినందిస్తున్నామో అంతగా వారికి కార్యాచరణ పట్ల నిబద్దతగా ఉండవలసిన అవసరాన్ని గుర్తు చేస్తున్నాము.

**డిసెంబర్ 11 నాటి కేంద్ర ప్రభుత్వ నిర్ణయము ప్రకటన ఎందరి త్యాగ ఫలితమో అనుక్షణం గుర్తుంచుకోవాలి.**

ప్రఖ్యాత తత్వవేత్త హెగెల్ చెప్పినట్టుగా -

"కేవలం ప్రాణత్యాగాల ద్వారానే స్వాతంత్ర్యం లభిస్తుంది"

"ప్రాణత్యాగానికి వెనుకంజ వేసేవారు వ్యక్తులుగా పిలవబడవచ్చుగానీ, తమలోనే నిక్షిప్తమై ఒక స్వేచ్ఛాయుత అంత: చేతనం ఉన్నదన్న వాస్తవాన్ని గుర్తెరుగని స్థాయిలోనే జీవిస్తారు".

మనోల్లకు మన భాషల్నెజెప్పాలంటే ... గద్దరన్న పాట యాదికొస్తది.

వందానాలు ... వందానాలమ్మో మా పిల్లల్లారా....
వందానాలు ... వందానాలమ్మో మా కూనల్లారా ...

* * * * *